సాక్షి విశాఖపట్నం

ఆదివారం । 28 । జూలై । 2024



ఇసుక ఉచితమైతే..

ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సమావేశం శనివారం చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన వాడీవేడిగా జరిగింది. 8లో



300 కిలోల గంజాయి స్వాధీనం

తాడి మూడు మదుంల వద్ద 300 కిలోల గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి, కారును స్వాధీనం చేసుకున్నారు. 8లో



స్పెషల్ రైళ్లు పొడిగింపు

స్పెషల్ రైళ్లు మరింత కాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

ముడసర్లోవ రిజర్వాయర్‌కు జలకళ



ముడసర్లోవ రిజర్వాయర్

ఆరిలోవ: ముడసర్లోవ రిజర్వాయర్‌కు జలకళ వచ్చింది. పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు రిజర్వాయర్‌లో కొత్త నీరు చేరింది. కంబాలు కొండ, సింహాచలం కొండల నుంచి వచ్చిన వరద నీరుతో ఇందులో నీటి మట్టం పెరిగింది. పది రోజుల్లో సుమారు అడుగు ఎత్తు నీటి మట్టం పెరిగింది. ప్రస్తుతం 162.1 అడుగుల ఎత్తులో నీరు ఉన్నట్లు ముడసర్లోవ నీటి సరఫరా విభాగం అధికారులు తెలిపారు. కొత్త నీరు చేరి నిండుగా ఉండటంతో ముడసర్లోవ పార్కుకు వెళ్లిన యువకులు సెల్ఫీలు దిగుతున్నారు.

టమాటా కిలో రూ.32



మహారాణిపేట: రైతు బజార్లలో విక్రయించే టమాటాల ధర పెరిగింది. శనివారం టమాటా కిలో రూ.30కు విక్రయించగా.. ఆదివారం నుంచి రూ.32కు విక్రయించనున్నట్లు జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఓ ప్రకటనలో తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో ధరలు అందుబాటులోకి వచ్చే వరకు ఈ విక్రయాలు కొనసాగుతాయని జేసీ పేర్కొన్నారు.

పర్యాటక వ్యవస్థాపకాభివృద్ధిపై సదస్సు

విశాఖ సిటీ: ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఆగస్టు 6 నుంచి 9వ తేదీల్లో పర్యాటక వ్యవస్థాపకత అభివృద్ధిపై సర్టిఫికెట్ కోర్సు నిర్వహిస్తున్నట్లు ఫ్యాప్సీ కార్యదర్శి పి.వైదేహి తెలిపారు. ట్రావెల్, టూరిజం రంగంలో ఉన్న అవకాశాలను ఈ కోర్సులో వివరించనున్నట్లు చెప్పారు. ఈ రంగంలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఉండడంతో గణనీయమైన అభివృద్ధిని నమోదు చేస్తోందన్నారు. పర్యాటక రంగంలో ఉపాధి అవకాశాలు సృష్టించుకోవడంలో ఈ కోర్సు దోహదపడుతుందని సూచించారు.

ఐఎన్‌ఎస్ కరంజ్ సిబ్బందికి అభినందనలు



ఐఎన్‌ఎస్ కరంజ్ సిబ్బందికి అభినందనలు తెలుపుతున్న వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్

సింధియా: తూర్పు తీరంలో విజయవంతంగా విస్తరణను పూర్తి చేసుకున్న తూర్పు నావికాదళ జలాంతర్గామి ఐఎన్‌ఎస్ కరంజ్ సిబ్బందికి వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ అభినందనలు తెలిపారు. సన్‌రైజ్ కమాండ్ తమ కార్యాచరణలో భాగంగా అద్భుతమైన పనితీరును కనబరిచిందని నేవీ వర్గాలు తెలిపాయి.

టిక్.. టిక్..టిక్..

- జగదాంబ జంక్షన్‌కి కొత్తరూపు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.2.80 కోట్లతో పనులు
- గడియారాలు ఏర్పాటు చేసిన ఢిల్లీకి చెందిన మెడివల్ ఇండియా సంస్థ

మహా విశాఖలో తొలి క్లాక్ టవర్

నిత్యం జన సంద్రంతో కిటకిటలాడుతూ ఉండే జగదాంబ జంక్షన్ ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అత్యంత ఆకర్షణీయంగా జంక్షన్‌ను తీర్చిదిద్దింది. ముఖ్యంగా ఈ జంక్షన్‌కు కళ్లు చెదిరే అందాన్ని తీసుకొచ్చింది క్లాక్ టవర్. రంగురంగుల విద్యుత్ దీపాలతో మెరిసిపోతూ పాతనగరానికి కొత్త జీవం పోసింది. భారీ గడియారాలు నగర వాసులకు కాలాన్ని గుర్తు చేస్తూనే.. ఈ ప్రాంతానికి ప్రత్యేకతను తీసుకొచ్చాయి. రాత్రి వేళల్లో ఈ క్లాక్ టవర్‌ను చూడటం ఓ ప్రత్యేక అనుభూతి కలిగిస్తోంది. ఇక్కడ భారీ గడియారాలను ఢిల్లీకి చెందిన మెడివల్ ఇండియా సంస్థ ఏర్పాటు చేసింది. అసలు ఈ గడియారాల ప్రత్యేక ఏమిటి? మెడివల్ సంస్థ కథేంటి.? ఆ వివరాలను ఓ సారి చదివేద్దామా.? – సాక్షి, విశాఖపట్నం

SUNDAY SPECIAL

పూర్వ కాలంలో సూర్యుడు ఎండ వల్ల ఏర్పడే నీడని బట్టి టైమ్ తెలుసుకునేవారు. నిజాం నవాబులు, బ్రిటీష్ వారు పరిపాలించినప్పుడు వారి కింద పనిచేసే వారికి, సైనికులకు చేతి గడియారాలు ఉండేవి కాదు. వారికి సమయం తెలియజేసేందుకు ప్రధాన కేంద్రాల వద్ద క్లాక్ టవర్లు నిర్మించారు. సమయానికి విధులకు రాని వారిపై చర్యలు తీసుకునేందుకు కూడా ఈ క్లాక్ టవర్లు ఉపయోగపడేవి. క్రమంగా.. ప్రజలంతా ప్రధాన జంక్షన్లలో ఉండే క్లాక్ టవర్ల వద్దకు వచ్చి టైమ్ తెలుసుకునేవారు. హైదరాబాద్ మహానగరంలో నిజాంలు, బ్రిటిషర్లు మొత్తం 12 క్లాక్ టవర్లు ఏర్పాటు చేశారు. అంతకుముందు కేవలం అమెరికా, లండన్‌లో మాత్రమే క్లాక్ టవర్లు కనిపించేవి. అప్పట్లో క్లాక్ టవర్లలోని గడియారాలన్నీ లండన్ నుంచి దిగుమతి చేసుకునేవారు. క్రమంగా.. భారత్‌లోనూ గడియారాలు తయారవడం ప్రారంభమైంది.

నగరంలో తొలి క్లాక్ టవర్

భారీ గడియారాలు మహా విశాఖ నగరానికి కొత్తేం కాదు. భీమిలిలో 18వ శతాబ్దంలో డచ్ వారు నిర్మించిన గంట స్తంభం రాష్ట్రంలోనే అత్యంత పురాతనమైంది. 1923లో అప్పటి మద్రాస్ ప్రావెన్సీ ముఖ్యమంత్రి దివాన్ బహద్దూర్ పానుగంటి రామయ్యంగార్ ఆధ్వర్యంలో కేజీహెచ్‌లో భారీ గడియారాలు ఏర్పాటు చేశారు. 1926లో ఏయూ ఫిజిక్స్ విభాగంలో జైపూర్ మహారాజా భారీ గడియారాన్ని ఏర్పాటు చేశారు. కానీ హైదరాబాద్, రాజస్థాన్, ఢిల్లీ నగరాల్లో మాదిరిగా.. క్లాక్ టవర్లు మాత్రం విశాఖలో లేవు. జగదాంబ జంక్షన్‌లో ఏర్పాటు చేసిందే మొట్టమొదటి అతి పెద్ద క్లాక్ టవర్‌గా చెప్పవచ్చు.

గత ప్రభుత్వ హయాంలో..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో విశాఖ నగరం విశ్వనగరంగా రూపుదిద్దుకుంది. ఆహ్లాదంలోనూ, అభివృద్ధిలోనూ కొత్త వైజాగ్ పరిచయమైంది. ఎటు చూసినా పార్కులు, ప్రధాన సర్కిళ్లలో సరికొత్త డిజైన్లతో ఫౌంటెన్స్.. ఇలా విభిన్న విశాఖ కనిపిస్తోంది. ఇందులో భాగంగానే జగదాంబ జంక్షన్‌లో.. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టుల్లో భాగంగా 2023 నవంబర్‌లో క్లాక్ టవర్ నిర్మాణానికి మేయర్ గొలగాని హరివెంకటకుమారి శంకుస్థాపన చేశారు. రూ.2.80 కోట్లతో నిర్మించిన ఈ క్లాక్ టవర్‌లో 4 గడియారాల ఏర్పాటు పనులను మాత్రం ఢిల్లీకి చెందిన మెడివల్ ఇండియా సంస్థకు అప్పగించారు. 60 అడుగుల పొడవైన ఈ టవర్‌తో పాటు అద్భుతమైన ల్యాండ్ స్కేపింగ్‌తో కూడిన ఫౌంటెన్ కూడా ఏర్పాటు చేశారు.

ప్రధాన నగరాల్లో 'మెడివల్' క్లాక్స్

చరిత్ర పుటల్లో తమకంటూ ప్రత్యేక పేజీని లిఖించుకున్న ఈ సౌధ గడియారాలు తయారు చేసిన మెడివల్ ఇండియా సంస్థ ఢిల్లీకి చెందింది. దేశంలోని పలు రాష్ట్రాలు, ప్రధాన నగరాల్లో ఏర్పాటు చేసిన క్లాక్ టవర్స్, భారీ గడియారాలన్నీ మెడివల్ ఇండియా సంస్థకు చెందినవే. ఢిల్లీ, యూపీలోని ఖతౌలీ, ఐఐటీ రూర్కెలా, అలీఘర్ ముస్లిం యూనివర్సిటీ, సిమ్లా, ముస్సోరీ, పానిపట్, బెంగళూరు, గుర్‌గ్రామ్, జైపూర్, కోల్‌కతా, చెన్నై, డెహ్రాడూన్, రాజస్థాన్, అరుణాచల్‌ప్రదేశ్.. ఇలా ప్రతి నగరానికీ అక్కడి ప్రజల అభిరుచులకు తగ్గట్లుగా గడియారాలు అందించడం వీరి ప్రత్యేకత. కొన్ని కోట్ల మందికి వీరి గడియారాలు టైమ్‌ను చూపిస్తున్నాయి. ప్రతి గడియారంలోనూ 'సీటీటీ' ఉండేలా చూసుకోవడమే వీరి ప్రత్యేకత. సీ అంటే క్రాఫ్ట్‌మెన్ షిప్, టీ అంటే ట్రెడిషన్, టీ అంటే టెక్నాలజీతో తీర్చిదిద్దుతారు. విశాఖ నగరంలో ఏర్పాటు చేసిన నాలుగు గడియారాలు డిజిటల్ కంట్రోల్‌తో పాటు సరైన సమయాన్ని చూపించేలా జీపీఎస్ ద్వారా అనుసంధానం చేశారు. టవర్ క్లాక్ కంట్రోలర్ ద్వారా నాలుగు గడియారాలను నడిపిస్తారు. విద్యుత్ సరఫరాలో ఏదైనా లోపాలు తలెత్తితే.. 48 నుంచి 72 గంటల పాటు నిర్విరామంగా నడిచేలా ప్రతి గడియారంలోనూ ఇన్‌బిల్ట్ పవర్ బ్యాకప్ ఉంది. 20 రకాలుగా క్లాక్ డయల్స్ తయారు చేయడం ఈ సంస్థ ప్రత్యేకత. క్లాక్ టవర్‌తో జంక్షన్‌కు కొత్త రూపు తీసుకొచ్చిన మెడివల్ ఇండియా పనితనానికి వైజాగ్ నగరం సెల్యూట్ చేస్తూ మురిసిపోతోంది.



క్లాక్ టవర్

మరిన్ని విశేషాలు..

- ప్రపంచంలో మొట్టమొదటి క్లాక్ టవర్‌ను ఏథెన్స్‌లో ఒకటో శతాబ్దంలో రోమన్ గ్రీస్ కాలంలో ఏర్పాటు చేశారు.
- భారత్‌లో తొలి క్లాక్ టవర్ 1870లో ఢిల్లీలోని షాజహానాబాద్‌లో ఏర్పాటైంది.
- ఏపీలో అత్యంత పురాతనమైన గంట స్తంభం భీమిలిలో ఉంది.
- విజయనగరంలో 1885లో 68 అడుగుల గంట స్తంభం ఏర్పాటుకైన ఖర్చు రూ.5400
- రాష్ట్రంలో పురాతన, ప్రసిద్ధ క్లాక్ టవర్ అనంతపురంలో ఉంది. 42 మీటర్ల ఎత్తులో ఉన్న ఈ టవర్‌ను 1892లో బ్రిటిష్ ఇంజినీర్ రీస్ రెడ్‌వుడ్ విక్టోరియా రాణి పట్టాభిషేకానికి గుర్తుగా నిర్మించారు. లండన్‌లోని బిగ్‌బెన్ క్లాక్‌టవర్ డిజైన్‌తో దీన్ని నిర్మించడం విశేషం.
- వైజాగ్‌లో నిర్మించిన క్లాక్ టవర్ వ్యయం రూ.2.80 కోట్లు. పొడవు 60 అడుగులు

నగర అభిరుచికి తగ్గట్టుగా తయారు చేస్తాం



దేశంలోని ప్రతి నగరంలోనూ దాదాపు మా సంస్థకు చెందిన గడియారాలు ఏర్పాటయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో మొదటిసారిగా క్లాక్ టవర్ ఏర్పాటు చేశాం. ముందుగా వైజాగ్ విశిష్టత తెలుసుకున్నాం. ఏ తరహా డిజైన్ ఇక్కడ సరిపోతుందో అంచనా వేసి.. నగర అభిరుచికి తగ్గట్లుగా తయారు చేశాం. భారతీయ సంప్రదాయం, చరిత్ర మిళితమయ్యేలా నైపుణ్యం కలిగిన హస్త కళాకారులతో గడియారాలు తయారు చేస్తుంటాం. చాలాకాలం మన్నికగా ఉండేలా.. ఇక్కడ సముద్రపు గాలులను తట్టుకుని నిలబడేలా క్లాక్ టవర్‌లోని వాచ్‌లు రూపొందించాం.

–అంబికా బక్షి, మెడివల్ ఇండియా సీఈవో

'జగ'జ్జంత్రీ

- సీఐడీకే ఝలక్ ఇచ్చిన హయగ్రీవ ఎండీ జగదీశ్వరుడు
- సీజ్ చేసిన ప్రాపర్టీని బ్యాంకులో తనఖా
- స్వాధీన హెచ్చరిక బోర్డు ఉన్నా రుణమిచ్చిన యూనియన్ బ్యాంక్
- చీటింగ్, నకిలీ డాక్యుమెంట్ల సృష్టి, ఇలా వివిధ స్టేషన్లు, కోర్టుల్లో 97 కేసులు
- సీఐడీ ఏడీజీకి ఫిర్యాదు.. చర్యలకు మీనమేషాలు


విశాఖ సిటీ: భూములకు నకిలీ సేల్ డీడ్లు సృష్టించాడు. బ్యాంకులో రుణాలు తీసుకొని మళ్లించాడు. నకిలీ జీఎస్టీ ఇన్‌వాయిస్‌లతో ఇన్‌పుట్ క్రెడిట్ క్లెయిమ్ చేసేశాడు. సంస్థలో నిధులను కాజేసి భాగస్వాములను నట్టేటముంచాడు. రిసార్టులో గ్యాంబ్లింగ్.. చీటింగ్.. ఇలా ఒకటి కాదు.. రెండు కాదు.. పలు కోర్టులు, స్టేషన్లలో 97 కేసులు ఉన్న ఘనుడు హయగ్రీవ ఎండీ జగదీశ్వరుడు.. తాజాగా నేర పరిశోధన సంస్థ(సీఐడీ)కు కూడా ఝలక్ ఇచ్చాడు. సీఐడీ సీజ్ చేసిన భవనాన్ని సైతం బ్యాంకులో తనఖా పెట్టి దర్జాగా రుణం తీసుకున్నాడు. దీనిపై సీఐడీ అదనపు డీజీకి ఫిర్యాదులు అందినప్పటికీ చర్యలు తీసుకోకుండా మీనమేషాలు లెక్కిస్తుండడం గమనార్హం. జగదీశ్వరుడిపై వందకు దగ్గరగా కేసులు ఉన్నా బ్యాంకు రుణాలు దుర్వినియోగం చేసిన వ్యవహారంలో కేంద్రమే లుక్‌అవుట్ నోటీసు జారీ చేసినా దర్జాగా తిరిగేస్తున్నాడు.

అడుగుపెట్టిన చోటల్లా మోసమే..

జగదీశ్వరుడు అడుగు పెట్టిన ప్రతీ చోటా ప్రభుత్వ సంస్థలను, భాగస్వాములను, ప్రజలను నిలువునా ముంచుతూనే ఉన్నాడు. వృద్ధాశ్రమం పేరుతో కొన్నేళ్ల కిందట టీడీపీ ప్రభుత్వ హయాంలో వీఎంఆర్‌డీఏ నుంచి రుషికొండ ప్రాంతంలో సుమారు 12 ఎకరాలను హయ గ్రీవ ఇన్‌ఫ్రాటెక్ ప్రాజెక్ట్స్ పేరుతో తీసుకొని ముఖం చాటేశాడు. నిర్మాణాలు చేపట్టకుండా రూ.వందల కోట్లు విలువైన భూమిని కాజేయాలని ప్రయత్నించా డు. అలాగే విలువైన భూములకు నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్లు, నకిలీ డాక్యుమెంట్లతో ల్యాండ్ పూలింగ్‌లో మోసాలు, సంస్థలో నిధులు కాజేసి భాగస్వాములను మోసం చేయడం.. ఇలా అనేక కేసులు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి.

సీఐడీలో రెండు కేసులు

జగదీశ్వరుడిపై ఇప్పటికే సీఐడీలో రెండు కేసులు నమోదయ్యాయి. భీమిలి మండలం చిప్పాడ గ్రామంలో సర్వే నెంబర్ 160/1లో అర్జర్ల శ్రీనివాసరావు, అతని కుటుంబ సభ్యులకు చెందిన సుమారు 4.61 ఎకరాలకు దొంగ డాక్యుమెంట్లు సృష్టించి హయగ్రీవ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. దీనిపై సదరు యజమానులు ఫిర్యాదు చేయగా.. సీఐడీ అధికారులు కేసు నమోదు చేశారు. అలాగే మరో వ్యవహారంలో కేస్ నంబర్ 3/2013తో మరో కేసు నమోదు చేయడంతో పాటు ఎంవీపీ కాలనీ సెక్టర్–2లో సర్వే నంబర్ 5/పి, 6/పీలో నిర్మాణంలో ఉన్న 3126 చదరపు గజాల భవనాన్ని 2015 ఆగస్టు 11వ తేదీన జీవో 124 ప్రకారం స్వాధీనం చేసుకున్నారు.



స్వాధీనం చేసుకున్న నిర్మాణాన్ని బ్యాంకులో తనఖా

సీఐడీ స్వాధీనం చేసుకున్న నిర్మాణాన్ని సైతం జగదీశ్వరుడు బ్యాంకులో తనఖా పెట్టడం విశేషం. 2020 సెప్టెంబర్‌లో యూనియన్ బ్యాంకు నుంచి సుమారు రూ.3.67 కోట్లు దర్జాగా రుణం తీసుకున్నాడు. ఒకవైపు సీఐడీ ఆ భవనానికి స్వాధీన హెచ్చరిక బోర్డును సైతం ఏర్పాటు చేసింది. ఈ స్థలంపై ఎటువంటి అమ్మకాలు, కొనగోలు నిషేధించనట్లు అందులో పేర్కొంది. అయినప్పటికీ జగదీశ్వరుడు బ్యాంకుకు మార్ట్‌గేజ్ చేసి రుణం పొందడం విశేషం.

సీఐడీకి పలువురు ఫిర్యాదు

జగదీశ్వరుడి చేతిలో మోసపోయిన పలువురు బాధితులు సీఐడీ ఏడీజీకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. జగదీశ్వరుడిపై అనేక కేసులు ఉన్నప్పటికీ చర్యలు తీసుకోకపోవడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ సంస్థలను, ప్రజలను మోసం చేసినా సీఐడీ అధికారులు పట్టించుకోకపోవడాన్ని ప్రశ్నిస్తున్నారు. అన్ని ఆధారాలను సీఐడీ ఏడీజీకి లేఖ రాశారు.

తహసీల్దార్ బదిలీల్లో పైరవీలు

- ఎమ్మెల్యేల సిఫార్సు మేరకే పోస్టింగులు
- రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలు వసూలు?
- ఆరోపణలున్నా కావాల్సిన చోట పోస్టింగులు



మహారాణిపేట: జిల్లాలో తహసీల్దార్ల బదిలీల్లో పైరవీలకే పెద్దపీట వేశారు. ఎమ్మెల్యేల సిఫార్సులకే అగ్రతాంబూలం వేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి కీలక మండలాల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు. ఇందులో రూ.లక్షలు చేతులు మారాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో భీమిలి, ఆనందపురం, పెందుర్తి మండలాలకు గట్టి పోటీ ఎదురైంది. 21 మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ హరేందిర ప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

పోస్టింగుల్లో ఎమ్మెల్యేలదే పైచేయి

తహసీల్దార్ల పోస్టింగుల్లో ఎమ్మెల్యేలదే పై చేయిగా నిలిచినట్లు తెలుస్తోంది. కూటమికి చెందిన ఎమ్మెల్యేలు చెప్పిన వారికే డిమాండ్ ఉన్న చోట పోస్టింగ్‌లు లభించాయన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆరోపణలు ఎదుర్కొంటున్న కొంతమంది తహసీల్దార్లకు కీలక మండలాలు కేటాయించడం గమనార్హం. కూటమి నేతలు ఒక్కో పోస్టింగ్‌కు మండలాన్ని బట్టి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలు వసూలు చేశారన్న వార్త రెవెన్యూ వర్గాల్లోనే హాట్ టాపిక్‌గా మారింది. టీడీపీ, జనసేన నేతలు కలిసికట్టుగా తమకు కావాల్సిన వారికి పోస్టింగ్‌లు ఇప్పించుకున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

21 మంది తహసీల్దార్లకు పోస్టింగులు

సార్వత్రిక ఎన్నికల కోసం ఇతర జిల్లాలకు వెళ్లి వెనక్కి వచ్చిన 21 మంది తహసీల్దార్లకు శనివారం కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ పోస్టింగులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎం.రమేష్‌ను సీతమ్మధారకు, ఎం.పాల్ కిరణ్‌ను విశాఖ రూరల్‌కు, కె.ఆనందకుమార్‌ను వీఎంఆర్‌డీఏ స్పెషల్ తహసీల్దార్‌గా, ఆడబాల శ్రీనివాసరావును కలెక్టరేట్‌లో పర్యవేక్షకుడిగా, కేవీ ఈశ్వరరావును కలెక్టరేట్‌లో పర్యవేక్షకుడు (అడ్మిన్)గా, పి.రామారావును భీమిలికి, వి.సుజాతను కలెక్టరేట్‌లో పర్యవేక్షకురాలి (ల్యాండ్స్)గా, ఎల్.రామారావును పెదగంట్యాడకు, కె.వేణుగోపాల్‌ను పెందుర్తికి, సీహెచ్‌వీ రమేష్‌ను గోపాలపట్నంకు, ఎం.ఆనందకుమార్‌ను పద్మనాభంకు కేటాయించారు. కె.జయను మహారాణిపేటకు, పి.శ్యాం ప్రసాద్‌ను ఆనందపురానికి, కె.రామాదేవిని విశాఖ ఆర్‌డీవో కార్యాలయం పరిపాలనాధికారి(ఏవో)గా, ఎం.ఎ.మనోరంజనిని భీమిలి ఆర్‌డీవో కార్యాలయం పరిపాలనాధికారి(ఏవో)గా, జె.తారకేశ్వరిని ములగాడకు కేటాయించారు. బీటీవీ రామారావును విశాఖ రెవెన్యూ డివిజన్ స్పెషల్ తహసీల్దార్ (ఎల్ఏ)గా, ఎంవీకేఎస్ రవిని జీవీఎంసీ ఎస్టేట్ ఆఫీసర్‌గా, వి.శ్యాం కుమార్‌ను విశాఖ కలెక్టరేట్(కోఆర్డినేషన్ పర్యవేక్షకుడి)గా, టి.శ్రీవల్లిని తిరిగి గాజువాక తహసీల్దార్‌గా, కె.గణపతిరావును విశాఖ ప్రత్యేక తహసీల్దార్‌గా (ఎల్ఆర్)గా నియమించారు.

మంచి చేస్తే గుర్తింపు.. లేదంటే చర్యలు

- సక్రమంగా విధులు నిర్వర్తించే వారికి తగిన ప్రాధాన్యం
- ప్రతి నెలా రివార్డు మేళా నిర్వహిస్తాం
- అధికారుల అవినీతిపై ప్రజలే వీడియోలు పంపిస్తున్నారు
- నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ



రివార్డులు అందిస్తున్న సీపీ శంకబ్రత బాగ్చీ. చిత్రంలో జాయింట్ సీపీ ఫకీరప్ప

విశాఖ సిటీ: సక్రమంగా విధులు నిర్వర్తించే పోలీసులకు ప్రాధాన్యమిస్తామని.. అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తేల్చి చెప్పారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన హోంగార్డు నుంచి సీఐ స్థాయి అధికారులను ప్రోత్సహించేందుకు శనివారం పోలీస్ సమావేశ మందిరంలో రివార్డు మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. విధులకు ప్రాధాన్యమిస్తూ ఉత్తమ ప్రతిభ చూపించిన వారిని ప్రోత్సహిస్తూ ఇకపై ప్రతి నెలా రివార్డు మేళా నిర్వహిస్తామన్నారు. విశాఖ ప్రశాంతంగా.. ప్రజలంతా భద్రతగా ఉండాలంటే పోలీసులు అహర్నిశలు శ్రమించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎక్కువగా కష్టపడేది హోంగార్డుల నుంచి సీఐ స్థాయి వరకు అధికారులేనని, వారికి శ్రమకు తగిన గుర్తింపు అవసరమన్నారు.

ప్రజలే నాకు కళ్లు.. చెవులు

పోలీసులు అవినీతి లేకుండా పనిచేయాలని సీపీ సూచించారు. ప్రజలే తనకు కళ్లు, చెవులు అని పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేయడం తప్పా.. అవినీతికి పాల్పడొద్దని సూచించారు. అవినీతికి పాల్పడిన అధికారుల వీడియోలు, ఆడియో మెసేజ్‌లను ప్రజలు పంపిస్తున్నారని తెలిపారు. ఇప్పటికే ప్రజల నుంచి వచ్చిన రెండు వీడియో ఆధారాలతో ఓ హెడ్‌కానిస్టేబుల్, ఓ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసినట్లు గుర్తు చేశారు. ఈ వీడియో సమాచారం పంపించిన వారి వివరాలను గోప్యంగా ఉంచానన్నారు. అధికారులు, సిబ్బంది ఎవరైనా లంచాలు తీసుకుంటే మాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు. అవసరమైతే అటువంటి వారిని డిస్మిస్ చేసే ఆలోచన చేస్తామని హెచ్చరించారు. పోలీస్ శాఖకు కావాల్సింది అవినీతి అధికారులు కాదన్నారు. అయితే రెండు రోజుల కిందట విశాఖ పోలీసులు లంచాలు తీసుకుంటున్నట్లు వైరల్ అయిన వీడియో వాస్తవం కాదన్నారు.

ఉద్యోగ విరమణ రోజే బెనిఫిట్స్

తాను విశాఖలో ఉన్నంత వరకు ఇక్కడి సిబ్బంది, అధికారులు పదవీ విరమణ చేసిన రోజే వారికి అన్ని రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందించే ఏర్పాట్లు చేస్తున్నట్లు సీపీ వివరించారు. ఉద్యోగంలో ఉంటేనే అందరూ పట్టించుకుంటారని.. ఉద్యోగ విరమణ తర్వాత ఎవరూ పట్టించుకోరన్నారు. అటువంటి పరిస్థితి రాకుండా వారి ఉద్యోగం ఆఖరి రోజున అన్ని బెనిఫిట్స్ అందేలా చూస్తానన్నారు.

అవగాహనకు ప్రత్యేక వీడియో

సైబర్ నేరాల నియంత్రణకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జాయింట్ సీపీ ఫకీరప్పను ఆదేశించినట్లు సీపీ తెలిపారు. ప్రతి స్కూల్, కాలేజ్, ప్రధాన జంక్షన్లలో హోర్డింగ్‌లు, బ్యానర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రధానంగా సైబర్ నేరగాళ్లు ప్రజలను ఎన్ని విధాలుగా దోచుకుంటున్నారన్న విషయాలపై వీడియోను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. సైబర్ మోసాల బారిన పడకుండా ఎలా అప్రమత్తంగా ఉండాలో స్పష్టంగా వివరిస్తామన్నారు. అన్ని కాలేజీలు, జంక్షన్లలోతో పాటు సినిమా థియేటర్లలో కూడా ప్రదర్శిస్తామన్నారు.

నాపై కూడా 'సైబర్'గురి పెట్టారు

సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయని సీపీ ఆందోళన వ్యక్తం చేశారు. తనను మోసం చేయడానికి కూడా ఎస్‌బీఐ రివార్డుల పేరుతో సైబర్ నేరగాళ్లు మెసేజ్ పంపించారని వెల్లడించారు. సైబర్ నేరాలకు పాల్పడుతున్న వారందరూ విద్యావంతులే అని వెల్లడించారు.

కేసుల విషయంలో అనుమానాలున్నాయి

ఫోర్త్‌టౌన్ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసిన విషయంపై సీపీ మాట్లాడుతూ ఆ కానిస్టేబుల్ తరహాలోనే చాలా మంది వ్యవహరిస్తున్నారన్న అనుమానాలు ఉన్నాయన్నారు. దీనిపై లోతైన విచారణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే సస్పెన్షన్ ఆర్డర్‌లో చేసిన తప్పును పేర్కొనలేదని, లేదంటే మిగిలిన వారు తప్పించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ అంశంపై విచారణకు డీసీపీ–1, డీసీపీ–2, ఏడీసీపీ(ట్రాఫిక్)లకు బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు. ఆ కానిస్టేబుల్ వ్యవహారం కూడా తన మొబైల్‌కు వచ్చిన వీడియో ద్వారా తెలిసిందన్నారు.

81 మందికి రివార్డులు

విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 81 మంది పోలీస్ సిబ్బందికి సీపీ రివార్డులు అందజేశారు. గంజాయి సీజ్, చోరీ కాబడిన సొత్తు రికవరీ, బెయిల్‌పై వచ్చి బాధితురాలిపై దాడికి ప్రయత్నించిన నిందితుడి అరెస్ట్, వ్యభిచారం చేస్తున్న విటులను సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు అప్పగించిన పోలీస్ డ్రైవర్, డికాయ్ ఆపరేషన్‌లో డ్రగ్స్ స్వాధీనం ఇలా పలు కేసులు ఛేదించడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 81 మంది పీసీ నుంచి సీఐ వరకు సిబ్బందికి రివార్డులు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ ఫకీరప్ప, డీసీపీ–1 అజిత, డీసీపీ–2 తుహిన్ సిన్హా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తులు

విశాఖ విద్య: రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో కోరారు. తగిన ధ్రువీకరణ పత్రాలతో ఆగస్టు 5వ తేదీ నాటికి డీఈవో కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

మహారాణిపేట: ఆగస్టుకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారుల ఇంటి వద్దనే పంపిణీ చేయడానికి జిల్లా యంత్రాంగం ప్రణాళిక రూపొందించింది. ఒకటి, రెండో తేదీల్లో మాత్రమే ఇంటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో 1,63,210 మంది పింఛనుదారులు ఉన్నారు. పింఛనుదారులంతా ఆగస్టు ఒకటో తేదీన అందుబాటులో ఉండాలని కలెక్టర్ కోరారు. ఆగస్టు ఒకటో తేదీన ఉదయం 6 గంటల నుంచి పింఛన్లు పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించారు.

కానిస్టేబుల్ హరీష్ సస్పెన్షన్

సీతమ్మధార: అవినీతికి పాల్పడిన నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ హరీష్‌ను పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సస్పెండ్ చేశారు. ఫోర్తుటౌన్ కానిస్టేబుల్ హరీష్ అవినీతికి పాల్పడుతున్నట్లు గుర్తు తెలియని వ్యక్తి వీడియో తీసి.. సీపీ ఫోన్ నంబర్ 79950 95799కు పంపించారు. దీనిపై విచారణ జరిపించి.. కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసినట్లు సీపీ ఓ ప్రకటనలో తెలిపారు.

ఇసుక ఉచితమైతే వసూళ్లెందుకు?

- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి
- వాడీవేడిగా జిల్లా పరిషత్ సమావేశం

సాక్షి, విశాఖపట్నం: 'ఖరీఫ్ సీజన్ నాటికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పెట్టుబడికి వైఎస్సార్ రైతు భరోసా అందింది. పంటల బీమా సౌకర్యం కల్పించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి 45 రోజులు గడిచిపోయింది. ఇప్పటికీ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీపై ఉలుకూ.. పలుకూ లేదు.. ప్రభుత్వం సరఫరా చేసిన నకిలీ విత్తనాలతో రైతులు నిండా మునిగిపోయారు. రాజకీయాలు మాని.. ప్రజల సమస్యలు, రైతుల శ్రేయస్సుపై దృష్టి పెట్టండి.' అంటూ జెడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు, బుచ్చియ్యపేట జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇసుక ఉచితమని చెప్పి.. డబ్బులు ఎందుకు వసూళ్లు చేస్తున్నారని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సమావేశం నగరంలోని జెడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన వాడీవేడిగా సాగింది. ముందుగా మహాత్మా గాంధీ చిత్రపటానికి జెడ్పీ చైర్‌పర్సన్, సీఈవో పోలినాయుడు, జిల్లా అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలుత అజెండాను సీఈవో చదివి వినిపించారు. ఈ సందర్భంగా పలు శాఖలపై చర్చించారు. అజెండాలో 156 అంశాలు చేర్చినప్పటికి.. ప్రధానంగా వ్యవసాయం, సీజనల్ వ్యాధులు, ఇసుక పాలసీ, పర్యాటకం, విద్యా వ్యవస్థపై చర్చ సాగింది.

సమావేశం ప్రారంభమైన కొద్ది సేపటికి యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ గత ప్రభుత్వంపై విమర్శలు చేయగా.. జెడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు, బుచ్చియ్యపేట జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు తిప్పికొట్టారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల కారణంగానే నిధుల కొరత వచ్చిందని ఎమ్మెల్యే మాట్లాడగా.. వారు జోక్యం చేసుకుని రాజకీయాలు మాని.. ప్రజా సమస్యల పరిష్కారం, రైతుల శ్రేయస్సు కోసం మాట్లాడితే మంచిదని బదులిచ్చారు. దీంతో ఇరువర్గాల మధ్య కొంత సేపు వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ వేదికపై నుంచి దిగి వచ్చి సభ్యులను వారించే ప్రయత్నం చేశారు. ఇరువర్గాలు వెనక్కి తగ్గకపోవడంతో.. సమావేశానికి అంతరాయం కలిగించాలనుకుంటే బయటకు వెళ్లిపోవచ్చని ఆగ్రహం వ్యక్తం చేశారు.


వాగ్వాదానికి దిగిన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌ను వారిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర. చిత్రంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

నాణ్యత లేని విత్తనాల సరఫరా

'ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది.. వర్షాలు విస్తృతంగా కురుస్తున్నాయి. రైతులు వరినాట్లకు సిద్ధంగా ఉన్నారు. కానీ ప్రభుత్వం నాణ్యత లేని విత్తనాలు సరఫరా చేసింది. పొల్లు విత్తనాలు ఇచ్చారు' అంటూ అల్లూరి జిల్లా జెడ్పీటీసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నష్టం వాటిల్లిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని కొయ్యూరు జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు డిమాండ్ చేశారు. విపత్తుల నుంచి రైతులను కాపాడేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉచితం బీమా కల్పించిందని, ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ఈ–క్రాప్‌పై స్పష్టత ఇవ్వలేదన్నారు. ఈ–క్రాప్ నమోదు చేసి ప్రీమియం ప్రభుత్వం చెల్లించాలన్నారు. ఈ–క్రాప్ నమోదు చేసుకోకుంటే ధాన్యం కొనుగోలు చేపట్టరని ఎమ్మెల్సీ కల్యాణి, ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. అయితే ఈ–క్రాప్‌పై ప్రభుత్వం నుంచి ఎటువంటి మార్గదర్శకాలు లేవని అధికారులు తెలిపారు. అరకు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రజా ప్రతినిధులను అవమానించినటువంటి వైద్యాధికారులున్నారని ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆగ్రహం వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల వైద్యాధికారితో మాట్లాడాలని వస్తే తనకు ఎదురైన అనుభవం ఇదన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించాల్సిన బాధ్యత వైద్యాధికారులపై ఉందని స్పష్టం చేశారు.

పాఠశాలల్లో గంజాయిపై ప్రత్యేక నిఘా

విద్యా, వైద్య, వ్యవసాయ రంగాల్లో సేవలను మరింత విస్తృతం చేయాలని చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధికారులను ఆదేశించారు. చిన్నారుల భవిష్యత్‌కు భరోసా ఇవ్వాలని, పాఠశాలల్లో గంజాయి వినియోగంపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టాలని, ఫ్రై డే డ్రైడే కచ్చితంగా పాటించాలన్నారు. కేజీహెచ్‌లో నాణ్యమైన వైద్య సేవలందించాలన్నారు. అన్ని ఆస్పత్రుల్లో అవసరాలకు సరిపడా మందులను అందుబాటులో ఉండాలని, పాఠశాలలు, వసతి గృహాల్లో సేవలను మెరుగుపరచాలని ఆదేశించారు.

ఎర్రమట్టి తవ్వకాలు చేపట్టిందెవరు?



'వైద్యం నిమిత్తం ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి రోగులు కేజీహెచ్‌కు వస్తుంటారు. మార్చురీ వద్ద బాధితుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. అవసరానికి మించి వస్తువులు కొనుగోలు చేయిస్తున్నారు' అని పలువురు జెడ్పీటీసీ సభ్యులు లేవనెత్తిన అంశాన్ని ఉటంకిస్తూ.. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి డిమాండ్ చేశారు. ఉచిత ఇసుక విధానంపై ప్రజల్లో గందరగోళం నెలకొందని.. ఇసుక ఉచితం అని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారుల నుంచి ఎందుకు డబ్బులు వసూళ్లు చేస్తోందని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటికి డిపోల్లో ఎంత ఇసుక స్టాక్ ఉందని అధికారులను ప్రశ్నించారు. ఎర్రమట్టి అక్రమ తవ్వకాలు చేపట్టిన వారి వివరాలు తెలియజేయాలన్నారు.

సమావేశంలో ముఖ్యాంశాలు

- ఇటీవల మృతి చెందిన రావికమతం జెడ్పీటీసీ సభ్యురాలు తలారి రమణమ్మకు సభ్యులు సంతాపం తెలిపి.. ఆమె సేవలను గుర్తు చేసుకున్నారు.
- నూతన ఎమ్మెల్యేలను జెడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్లు, జెడ్పీటీసీ సభ్యులు ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.
- ఏపీ మినిస్టీరియల్ రూల్స్ ప్రకారం జెడ్పీ పరిధిలోని జూనియర్ అసిస్టెంట్ కమ్ క్లర్క్, టైపిస్ట్ కమ్ క్లర్క్ పేర్లను జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్‌గా, సీనియర్ అసిస్టెంట్ పేరును సీనియర్ ఆఫీస్ అసిస్టెంట్‌గా మార్పు చేసినట్లు సీఈవో వెల్లడించారు.
- జెడ్పీ పరిధిలోని ఏడు స్థాయీ సంఘాలకు నూతన సభ్యులను ఎంపిక చేస్తూ చైర్‌పర్సన్ ప్రతిపాదనలు చేయగా.. సభ్యులందరూ ఆమోదించారు. నూతన ఎమ్మెల్యేలను ఆయా కమిటీలకు ఎంపిక చేస్తూ సభ నిర్ణయం తీసుకుంది.
- తుంగ్లాం పాఠశాల స్థలం ఆక్రమణకు గురైందని, పూర్తి స్థాయి విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కోరారు
- ఫసల్ బీమా యోజన సేవలను రైతులకు చేరువ చేయాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు.
- ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ కోరారు.
- చోడవరం మండలం గంధవరంలోని విత్తన పరిశోధన కేంద్రాన్ని త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.రాజు కోరారు.
- కేజీహెచ్ సేవలను విస్తృతం చేయాలని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు కోరారు.
- ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీ సభ్యులు లేవనెత్తిన అంశాలపై కలెక్టర్లు స్పందించి.. వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని బదులిచ్చారు.
- ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు మూడు జిల్లాల కలెక్టర్లు ఎం.ఎన్ హరేందిర ప్రసాద్, విజయకృష్ణన్, దినేష్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు సమావేశానికి హాజరయ్యారు.

పిలిస్తే రాలేదని పెట్రోల్ పోశాడు

పోలీసుల అదుపులో నిందితుడు


నిందితుడు శివ శంకర్

గోపాలపట్నం: యువతి ఇంటిపై పెట్రోల్ పోసిన సంఘటన ఆశవానిపాలెంలో కలకలం రేపింది. శుక్రవారం అర్ధరాత్రి ఈ సంఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. ఆశవానిపాలెంలో మౌనిషా తన కుమారుడితో నివాసం ఉంటోంది. గోపాలపట్నానికి చెందిన ఆమె మేనకోడలు మౌని, ఆమె స్నేహితురాలు వారం రోజులుగా మౌనిషా ఇంట్లో ఉంటున్నారు. మౌని స్నేహితురాలితో ఊర్వశి జంక్షన్ గోకుల్‌నగర్‌కు చెందిన శివశంకర్‌కు పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారింది. ఈ నేపథ్యంలో శుక్రవారం అర్ధరాత్రి ఫోన్ చేసి మాట్లాడేందుకు బయటకు రావాలని కోరాడు. రాత్రి సమయంలో తాను బయటకు రానని ఆ యువతి సమాధానం చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో ఆమె ఉంటున్న ఇంటి కిటికీపై పెట్రోల్ పోశాడు. ఇది గమనించిన యువతులిద్దరూ గట్టిగా కేకలు వేయడంతో శివశంకర్ పరారయ్యాడు. వెంటనే 112కి కాల్ చేయడంతో బీట్ కానిస్టేబుల్ ఆదిమూర్తి, నైట్ రౌండ్స్‌లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ ఎస్.నానాజీ సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. ఎయిర్ పోర్టు పోలీసులు కేసు నమోదు చేశారు. పరారైన నిందితుడిని శనివారం అదుపులోకి తీసుకున్నామని సీఐ చక్రధర్ తెలిపారు.

300 కిలోల గంజాయి స్వాధీనం


గంజాయితో పట్టుబడిన కారు

పరవాడ: అనకాపల్లి–విశాఖ జాతీయ రహదారిలో తాడి మూడు మదుంల వద్ద గంజాయి రవాణా చేస్తున్న ఓ కారును పరవాడ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకుని ఒకర్ని అరెస్టు చేశారు. పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి...హైదరాబాద్‌లోని ఆసీఫ్‌నగర్‌కు చెందిన కంచాల సంతోష్ , సంతోష్‌సింగ్ గురువారం హైదరాబాద్ కారులో బయలుదేరి ఒడిశాలోని గునుపూరు జిల్లా పనసగూడ ప్రాంతానికి వెళ్లి అక్కడ గంజాయి కొనుగోలు చేశారు. గంజాయిని కారులో లోడు చేసుకొని హైదరాబాద్ తరలిస్తున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు అనకాపల్లి జిల్లా తాడి మూడు మదుంల సమీపంలో పోలీసులు మాటు వేసి కారును ఆపి తనిఖీ చేశారు. కారు డిక్కీలో రూ.15 లక్షల విలువైన 300 కేజీల గంజాయి పట్టుబడింది. గంజాయి స్వాధీనం చేసుకొన్నారు. కారుతో పాటు రూ.10 వేలు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కంచాల సంతోష్‌ను అరెస్టు చేయగా.. పోలీసులు కారు ఆపగానే సంతోష్ సింగ్ పరారయ్యాడు. తనిఖీల్లో పరవాడ ఎస్ఐ టి.మల్లేశ్వరరావు, ఏఎస్ఐలు త్రినాథ్, బి.వై.నాయుడు, హెడ్ కానిస్టేబుల్ వి.శ్రీనివాసరావు, కానిస్టేబుల్ వల్లీ, హోంగార్డు కె.వెంకటరావు పాల్గొన్నారు.

..అయితే జైలులో ఉండండి.. లేదంటే పారిపోండి

మహిళలు, పిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడే వారికి సీపీ గట్టి హెచ్చరిక

విశాఖ సిటీ: 'మహిళలు, పిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిని సహించేది లేదు. వికెట్ డౌన్ చేస్తాం.. అంటే ఎన్‌కౌంటర్ కాదు. రౌడీషీట్లు తెరుస్తాం. బైండోవర్ లేదా నగర బహిష్కరణ చేస్తాం. అయితే జైలులో ఉండాలి. లేదంటే పారిపోయి బతకాలి. మూడో ఆప్షన్ ఉండదు'అని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి నేరగాళ్లకు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. పోలీస్ సమావేశ మందిరంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. నగరంలో మహిళలు, పిల్లల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. వీరిపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టడమే తమ తొలి ప్రాధాన్యమన్నారు. భూ కబ్జాలకు పాల్పడే వారిని కూడా ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. వీరిపై కూడా రౌడీషీట్ తెరుస్తామని, జీవితమంతా కోర్టుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు కల్పిస్తామని హెచ్చరించారు. మహిళలు, పిల్లలను ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే వెంటనే తన నెంబర్ 79950 95799కు వీడియో, ఆడియో ఆధారాలతో మెసేజ్ చేయవచ్చని సూచించారు.

మత్తు పదార్థాల రవాణాకు అడ్డుకట్ట

మత్తు పదార్థాల రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలని సీపీ బాగ్చి అధికారులను ఆదేశించారు. పోలీస్ సమావేశ మందిరంలో ఏడీసీపీల నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులతో శనివారం నేర సమీక్ష నిర్వహించారు. ట్రాఫిక్, క్రైం, లా అండ్ ఆర్డర్ విభాగాల పనితీరుపై చర్చించారు. 100 రోజుల యాక్షన్ ప్లాన్‌తో గంజాయి, ఇతర డ్రగ్స్‌ను సమూలంగా అరికట్టే చర్యలను చర్చించి.. కొత్త చెక్ పోస్టులు, డికాయ్ టీంలు, పికెట్ల ఏర్పాటుపై పలు నిర్ణయాలు తీసుకున్నారు. పోక్సో కేసులపైనా ఆరా తీశారు. నగరంలో క్రైం రేటు తగ్గు ముఖం పట్టేలా రాత్రి పూట నిఘా మరింత పటిష్టం చేయాలన్నారు. సీజ్ చేసిన వాహనాలను చట్ట ప్రకారం ముందుగా ఎవరు డిస్పోజ్ చేస్తే వారికి రివార్డుగా తన సొంత డబ్బు రూ.10 వేలు రివార్డు అందిస్తానని జేసీపీ ఫకీరప్ప తెలిపారు. కోర్టులో కేసులు జాప్యం లేకుండా.. నిందితులకు శిక్ష పడేలా చేసేందుకు అధికారులు, సిబ్బంది సందేహాల నివృత్తికి పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఎం.శైలజ, కె.కృష్ణ, బి.వి.ఆర్.మూర్తి(బాబు)లతో పాటుగా మరికొంత మందిని సమావేశానికి ఆహ్వానించారు. డీసీపీ-1 అజితా వేజెండ్ల, డీసీపీ-2 తుహిన్ సిన్హా, డీసీపీ(క్రైం) వెంకటరత్నం పాల్గొన్నారు.


హౌరా యశ్వంత్‌పూర్ స్పెషల్ పొడిగింపు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రస్తుతం నడుస్తున్న స్పెషల్ రైళ్లు మరింత కాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు.

- ప్రతీ గురువారాల్లో హౌరాలో బయల్దేరే హౌరా-యశ్వంత్‌పూర్(02863) స్పెషల్ ఆగస్టు 15వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో యశ్వంత్‌పూర్‌లో ప్రతీ శనివారం బయల్దేరే యశ్వంత్‌పూర్-హౌరా(02864) స్పెషల్ ఆగస్టు 17వ తేదీ వరకు పొడిగించారు.
- గుంటూరు డివిజన్ విష్ణుపురం-కొండ్రపోల్ మధ్య ట్రాఫిక్ బ్లాక్ తీసుకుంటున్నందున ఆయా తేదీల్లో సంత్రగచ్చి-సికింద్రాబాద్ స్పెషల్ రైళ్లు దారి మళ్లిస్తున్నట్లు రైల్వే అధికారుల తెలిపారు.
- సంత్రగచ్చిలో ఆగస్టు 11వ తేదీన బయల్దేరే సంత్రగచ్చి-సికింద్రాబాద్(07222) స్పెషల్, తిరుగ ప్రయాణంలో ఆగస్టు 13వ తేదీన సికింద్రాబాద్‌లో బయల్దేరే సికింద్రాబద్-సంత్రగచ్చి (07221) స్పెషల్ రెగ్యులర్‌మార్గంలో కాకుండా వయా విజయవాడ, వరంగల్, కాజీపేట మీదుగా రాకపోకలు సాగిస్తాయి. గుంటూరు డివిజన్‌లో పనుల నిమిత్తం వచ్చే నెల 12,13 తేదీల్లో విశాఖ నుంచి బయల్దేరే విశాఖ-లింగంపల్లి (12805) జన్మభూమి ఎక్స్‌ప్రెస్ మార్గమధ్యలో ఆయా స్టేషన్లలో సుమారు 45 నిమిషాలు నిలిపివేయనున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.


కేకే లైన్‌లో రైళ్ల గమ్యం కుదింపు : కేకే లైన్‌లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా శనివారం ఉదయం విశాఖలో బయల్దేరిన విశాఖ-కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్ దంతేవాడ వరకు మాత్రమే నడిచింది. ఆదివారం కిరండూల్‌లో బయల్దేరాల్సిన కిరండూల్- విశాఖ (08552) పాసింజర్ స్పెషల్ కిరండూల్ నుంచి కాకుండా దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖ చేరుకుంటుంది.

మార్కెట్లోకి 'పల్సర్ ఎన్ఎస్ 400'


నూతన బైకులను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస, అబాస్ శేఖరన్, భవనేష్

బీచ్‌రోడ్డు: పల్సర్ శ్రేణిలో పూర్తిగా డిజిటల్ కన్సోల్‌తో రూపొందించిన సరికొత్త పల్సర్ ఎన్ఎస్ 400ను శనివారం సిరిపురంలోని వరుణ్ బజాజ్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బజాజ్ ఆటో ఎ.ఎస్.ఎం అబాస్ శేఖరన్, బజాజ్ ఆటో సర్వీస్ ఎస్ఎం భవనేష్, వరుణ్ బజాజ్ సీఈవో శ్రీనివాస హాజరై.. సంయుక్తంగా బైక్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస మాట్లాడుతూ సరికొత్త బైకులో 373 సీసీ ఇంజిన్, స్టైలిష్ సిగ్నేచర్ లైటింగ్ బోల్ట్ డీఆర్ఎల్, ఫ్లోటింగ్ ప్యానల్స్, కార్బన్ ఫైబర్ గ్రాఫిక్స్, స్పోర్టీ అండర్ బెల్లీ ఎగ్జాస్ట్, 6 స్పీడ్ గేర్ బాక్స్ దీని ప్రత్యేకత అన్నారు. వరుణ్ బజాజ్ జీఎం ప్రకాష్, ఏఎస్ఎంలు చంద్రశేఖర్, అశోక్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైభవ్ విశేష జ్యూయలరీ ప్రదర్శన


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న గంటా శారద తదితరులు

బీచ్‌రోడ్డు: బీచ్‌రోడ్డులోని వెల్‌కమ్ డీవీ గ్రాండ్ బే హోటల్‌లో విశేష పేరుతో వైభవ్ జ్యూయలర్స్ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ నగరవాసులను ఆకట్టుకుంటోంది. రెండురోజుల పాటు సాగే ఈ ఎగ్జిబిషన్‌ను గంటా శారద, ఆశ, సరోజిని, సురేఖ, సావిత్రి శనివారం ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో ఇన్‌స్పైర్డ్, హ్యాండ్ క్రాఫ్టెడ్, క్యూరేటెడ్ గోల్డ్, డైమండ్, ఏంటిక్, ఫ్యూజన్, ఫైన్ జ్యూవెలరీ డిజైన్లతో పాటు కస్టమర్ల అభిరుచికి తగ్గట్టుగా సరికొత్త కలెక్షన్ మహేయ (కోరల్) పగడాలతో పొదిగిన డిజైనర్ డైమండ్ జ్యూవెలరీని అందుబాటులో ఉంచారు. ఈ ప్రత్యేక కలెక్షన్స్ రూ.లక్షల నుంచి అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు.